# వయసు వేడి

## వేదగిరి రాంబాబు

రంగనాథ్ మనసు మాటలలోను, వాక్యాలలోను వర్ణించలేని వింత అనుభూతికి లోనవుతోంది.

ఇంతవరకూ ఎన్నో సినిమాల్లో చూసాడు ఎన్నో కథల్లో చదివాడూ మొదటి రాత్రి గురించి? ఇప్పుడు తను చవి చూడబోతున్నాడు.

ఆ అనుభూతి తాలూకు ఆలోచన్లు అతని మనసులో తియ్యటి బాధని కలిగిస్తున్నాయి.

వంటింట్లో శాంత పని ఇంకా పూర్తి కాలేదన్నట్లు గిన్నెల శబ్దాలు వినిపిస్తున్నాయి.

'ఇదే సినిమాలో అయితే వెంటనే హీరోగారు వెనుగ్గా వెళ్ళి హీరోయిన్ని వాటేసుకుంటారు. వంటిల్లుని వదిలి పెట్టే ఇద్దరూ పెరట్లోకో, డాబామీదకో వెళ్ళి ఎంచక్కా డ్యూయెట్లు పాడేసుకుంటారు' నవ్వొచ్చింది రంగనాథ్‌కి.

పెరట్లోకిగాని, డాబామీదకిగాని తామిద్దరూ ఇప్పుడు పరుగెత్తి పాటలు పాడడం ప్రారంభించారంటే పిచ్చెక్కిందేమో ననుకుంటారు చుట్టుపక్కలవాళ్ళు.

చుట్టుపక్కల వాళ్ళదాకా ఎందుకూ తనలా ప్రవర్తిస్తే పిచ్చెక్కిందేమోనని శాంతే బెదిరిపోతుంది. అందుకనే బుద్ధిగా కుర్చీలో కూర్చుని, చేతికి అందిన ఓ వారపత్రికని తీసుకుని తిరగవేయ సాగాడు. కళ్ళు పేజీల వెంట పరుగెడుతున్నా మన మాత్రం అనుభవించబోయే తియ్యటి అనుభూతి గురించే కలలు కనసాగింది.

విసుగ్గా పుస్తకాన్ని పక్కన పారేసి కుర్చీలో వెనక్కి వాలాడు.

శాంత పేరుకు తగ్గ శాంత స్వభావురాలే కాదు మంచి అందగత్తెకూడా? అందుకే చూడగానే వప్పేసుకున్నాడు పెళ్ళిచేసుకున్నాడు.

ఇప్పుడామె తన అర్ధాంగి?

గర్వంగా అనిపించింది రంగనాథ్‌కి.

ఇంతటి అపురూపమైన భార్యని పెట్టుకుని దూరం దూరంగా తిరగడం ఎంతో కష్టం. అందుకనే పెళ్ళి అయిపోగానే శలవులేదంటూ, పెద్దల్ని వప్పించి వెంట తీసుకొచ్చేసాడు శాంతని.

ఇంకా దాదాపు ఇరవై రోజుల శలవుంది. ఈ ఇరవై రోజులూ ఇద్దరూ ఆనందంగా గడిపేయాలి.

ఈ విషయం ఇంకా శాంతకి కూడా చెప్పలేదు! ఏదీ చెప్పే అవకాశం తనకి ఎక్కడిచ్చింది? వచ్చినప్పటి నుంచీ ఇల్లుసర్దడంలోనే మునిగి పోయింది. ఆ సర్దుడు కార్యక్రమం పూర్తికాగానే స్నానాలు, భోజనాలు... ఇక ఏకాంతం దొరుకుతుందిగదా అనుకుంటే మళ్ళీ వంటింట్లో సర్దుడు మొదలు పెట్టింది.

"మీరు వెళ్ళి పడుకోండి. నేనీ వంటిల్లు సర్ది వస్తాను" అని భోజనం కాగానే ఆర్డర్ జారీ చేసింది. తప్పకతనిలా వచ్చి కూలబడ్డాడు.

"ఏమిటి తెగ ఆలోచిస్తున్నారు" మరచెంబుతో నీళ్ళని తీసుకొచ్చింది శాంత.

"అబ్బే... ఏంలేదు... " ఆలోచనల్లోంచి బయట పడ్డాడు రంగనాథ్.

చిన్నగా నవ్వి "ఇప్పుడే వస్తా" అంటూ మళ్ళీ వంటింటి వేపు వెళ్ళి పోయింది శాంత.

రంగనాథ్‌కి తనమీద తనకే విపరీతమైన చిరాకు వేసింది.

శాంత లోపలికి రాగానే సినిమా హీరోలా అమాంతంగా దగ్గరకి తీసుకోలేకపోయినా కనీసం సరదాగా అయినా ఎందుకు మాట్లాడలేక పోయానా అని బాధపడ్డాడు.

అందమైన ఆమె మొహం చూసేసరికి ఆనందంతో పాటు ఓ విధమైన తత్తరపాటు కూడా కలిగింది. ఏమి మాట్లాడితే ఆమె ఎలా అర్థం చేసుకుంటుందో ననే భయం కలిగింది. అందుకే అలా అయిపోయాడు తను.

ఆమె ఎవరు?

తన భార్య

అయినా తనిలా ఎందుకైపోయాడు?

ఆమే ఇలాంటి అనుభూతులకి లోనవుతూనే వుంటుందా?

ముందసలు ఒకళ్ళ గురించి మరొకళ్ళకి పూర్తి అవగాహన వుండాలి. అప్పుడు పొరబాటున కూడా అపార్థాలు కలగడానికి అవకాశముండదు.

రంగనాథ్ తిరిగి ఆలోచనల్లో మునిగిపోయాడు.

తామిద్దరి మధ్యా అసలు రహస్యాలు అంటూ వుండకూడదు. ఒకళ్ళకి బాధ కలిగించే విధంగా మరొకళ్ళు పొరబాటున కూడా ప్రవర్తించకూడదు. ఒకళ్ళ కోసం మరొకళ్ళు అడ్జస్ట్ అయిపోవడం నేర్చుకోవాలి.

తామిద్దరి మధ్యా బంధం ఎలావుండాలి అని ఆలోచించసాగాడు. ఆఖరికి ఆమె రాగానే కాసేపు కూర్చోబెట్టి తన గురించి వివరాలన్నీ ఆమెకి చెప్పాలని కూడా నిశ్చయించుకున్నాడు.

ముందుగా చెప్పాల్సింది రాణి గురించి!

ఆమె తన మేనత్త కూతురు కావడంతో చిన్నప్పటి నుంచే అందరూ తామిద్దర్నీ మొగుడు పెళ్ళాలుగా చూసేవారు. ఆమాటలకి అర్థాలు

**తామిద్దరి మధ్యా కేవలం స్నేహం తప్ప మరే చొరవాలేదని చెప్పాలి. ఎప్పుడైతే ఆమెకి పెళ్ళయిందో అప్పుడే ఆమెని మనసునించి పూర్తిగా తొలగించేసానని కూడా చెప్పాలి. అంతేకాదు నామనసంతా నువ్వే ఆక్రమించేసావనీ చెప్పాలి.**